# పభుత్వ పథకాల అమలుపై సమీక్ష

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త : అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో రెవెన్యూ ఫేజ్ 3 రీ సర్వే ఇనామ్, అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్, ఆరోగ్య, వైద్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష,ఆరోగ్యశ్రీ, పిఆర్ఆర్డి ఉపాధి హామీ పథకం, ఏపిఐఐసి ప్రాజెక్టుల భూ సమస్యలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి డా. కెఎస్ జవహర్ రెడ్డి సమీక్షించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీ షా జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో ఎడి సర్వేర్ జయరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయ్ కుమార్, డిపిఓ రాజశేఖర్ రెడ్డి, డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, డిఎంహెచ్ఓ శ్రీహరి, జిల్లా ఆరోగ్య శ్రీ మేనేజర్ శివకుమార్, జగనన్న ఆరోగ్య సురక్షనోడల్ ఆఫీసర్ తేజస్విని, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫిరెన్స్ వీక్షిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


# సప్త వాహనాలపై సప్త గిరీశుడు

## తిరుమలలో ఘనంగా రథసప్తమి వేడుకలు



సూర్య ప్రభ వాహనం













తిరుమల,ఫిబ్రవరి 16ప్రభాతవార్తప్రతినిధి: "చూడరమ్మ సతులారా సోబాన పాడరమ్మ... కూడున్నది పతిచూడి కుడుత నాంచారి", "అన్ని మంత్రములు ఇందే ఆవహించెనూ"!అన్నమయ్య తన సంకీర్తనల్లో ఏడుకొండలస్వామి లీలావిశేషాలు గురించి చక్కగా ఆలపించినట్లు మాఘమాసం రథసప్తమి పర్వదినాన శుక్రవారం ఒకేరోజు ఏడువాహనాలు ఎక్కి తిరుమలరాయుడు భక్తులకు అభయమిచ్చాడు. వాహనసేవల్లో తొలివాహనంగా సూర్యప్రభపై ఉదయం 5.30గంటలకు శ్రీదేవిభూదేవితో కలసి వేంచేపుచేసిన శ్రీమలయప్పస్వామి ఆలయ నాలుగు మాఢవీధుల్లో ఊరేగారు. భక్తుల నుండి కర్పూరహారతులు అందుకున్నారు. ఏడుకొండల వాడా వేంకటరమణా గోవిందా గోవింద అంటూ భక్తులు సూర్యోదయం వేళ సప్తగిరుల్లో భక్తిభావం వెల్లివిరిసింది. ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభవాహనం, ఉదయం 9గంటలకు ఐదుతలల చిన్నశేష వాహనంపై, హనుమంతవాహనం, గరుడవాహనం, చక్రస్నానం,కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం చివరగా రాత్రి చంద్రప్రభవాహనంపై చల్లనిదేవుడు శ్రీనివాసుడు ఆలయ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ వాహనసేవల్లో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి, జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, తిరుపతి జిల్లా ఎస్‌పి మల్లికగర్గ్, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, వివిఎస్ఓ నందకిశోర్,తిరుమల సిఐలు విజయకుమార్, సత్య నారాయణ, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. టిటిడి అధికారులు సకలసౌకర్యాలు, భక్తులకు గ్యాలరీల్లో అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, టీ,కాఫీ, మజ్జిగ నిరంతరాయంగా పంపిణీ చేశారు. సౌకర్యాలతోభక్తులు ఆనందం వ్యక్తం చేశారు.కొన్ని వాహనాలను స్వయంగా భక్తుల్లాగా సేవకులుగా భూమన, ధర్మారెడ్డి భుజాలపై మోసి భక్తిపారవశ్యులయ్యారు.

# చక్కటి ప్రణాళిక... సమిష్టికృషి...భక్తుల పరవశం

## రథసప్తమి వాహనసేవలు విజయవంతంపై సంతృప్తి!



తిరుమల,ఫిబ్రవరి 16ప్రభాతవార్తప్రతినిధి: సాధారణంగా ఏడాదిలో తొమ్మిదిరోజులు 16వాహనాలపై బ్రహ్మోత్సవాల్లో ఊరేగే వెంకన్నను దర్శించుకునేందుకు లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు. ఒక్కోరోజు వచ్చిన భక్తులు స్వామిదర్శనం చేసుకోగానే తిరుగుముఖం పడుతారు. అలాంటిది అందుకు భిన్నంగా ఒకేరోజు ఏడువాహనసేవలు నిర్వహించడం, లక్షమందిపైగా భక్తులు ఒకచోట చేరితే సేవలు అందించడం మాటల్లో చెప్పడం కాదు...చేతల్లో చేసి చూపడం టిటిడి అధికారుల కృషి,సహకారం అందించిన పోలీసు,టిటిడి,విజిలెన్స్,శ్రీవారిసేవకులు, ఆలయం ఉద్యోగులు, ఆరోగ్యవిభాగం పనితీరును టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈఓ ఏవి ధర్మారెడ్డి, తిరుపతి జిల్లా ఎస్‌పి మల్లిక గార్గ్ అభినందించారు. రథసప్తమి పర్వదినం శుక్రవారం ఉదయం నుండి రాత్రి వరకు వరుసగా ఏడువాహనసేవలు వీక్షణకు విచ్చేసిన భక్తులకు ఏర్పాట్లు చేయడంలో టిటిడి విజయవంతమైంది. మాఢవీ ధుల్లో గ్యాలరీల్లో సామాన్యభక్తులు వేచివున్నా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా,పూర్తిస్థాయిలో భద్రత, నిరంతరాయంగా అన్నప్ర సాదాలు, అల్పాహారం, మంచినీరు.పాలు,టీ పంపిణీ తదితర సేవలందించి భక్తుల మన్ననలు అందుకున్నారు.

# సేంద్రీయ పంటల సాగుకు ప్రాధాన్యత

## - జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎంపీ రెడ్డప్ప



జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రెడ్డప్ప

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: : సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సేద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వ్యవసాయంను లాభసాటిగా మార్చడానికి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి పంటల సాగు చేసి అధిక దిగుబడి సాధించడానికి రైతుకు సలహాలు, సూచనలు అందిస్తోందని ఎంపీరెడ్డప్ప అన్నారు. బంగారుపాళ్యం మండలం దండువారిపల్లిలో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పి.రామ చంద్రారెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి అన్ని రకాల సూచనలు, సలహాలు అందిస్తున్నారన్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో రైతు సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చర్చించి రైతులకు ఉపయోగపడేవిధంగా సూచనలు ఇవ్వడం జరుగుతున్నదన్నారు. సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపుతుండటంతో నాణ్యమైన ఉత్పత్తులు తక్కువ ధరకు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అలాగే సేంద్రీయ, ఉద్యాన పంటల అమ్మకాలకు మరింతగా మార్కెటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రైతు పండిస్తున్న పంటలకు అనుగుణంగా సూచనలు, సలహాలు ఇవ్వడం, రైతుకు ఆదాయం లభించేలా చేయడం, జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో తీసుకొన్న నిర్ణయిలు ఇటు క్షేత్ర స్థాయికి అటు ప్రభుత్వానికి అందించడంతో పలు సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. జిల్లాలో రైతులు సాగు చేస్తున్న సేంద్రీయ పంట ఉత్పత్తులకు మంచి డిమాండ్ వచ్చిందని, రానున్న కాలంలో మరింతఅధిక ధరలు లభించేలా ప్రభుత్వం కృషి చేస్తుంద న్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో రైతుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిస్తు ఒడటంతో మంచి దిగుబడులు సాధిస్తున్నా మన్నారు. డిపిఎం వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధరలు వస్తున్నాయని, వీటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించ డానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌లో మామిడి ధరలు అధికంగా రావడానికి క్షేత్ర స్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించా మన్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలోని పశు సంపదకు 95 శాతం వాక్సినేషన్ పూర్తి అయ్యిందని, అంబు లెన్స్‌ల ద్వారా పశువులకు క్షేత్ర స్థాయికి వెళ్ళి విస్తృతంగా సేవలు అందిస్తున్నా మన్నారు. ఈ సమావేశం అనంతరం ఎంపీ రెడ్డప్ప, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పి.రామచంద్రారెడ్డి, అధికారులు, సభ్యులు గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను క్షేత్ర స్థాయికి వెళ్ళి పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లా ఎపిఎంఐపి అధికారి వెంకటరమణారెడ్డి, జిల్లా పట్టుపరిశ్రమల శాఖ జెడి శోభారాణి, ట్రాన్స్‌కో ఇఇ శ్రీహరి, డ్వామా ఎపిడి గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



చిత్తూరు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికలు-2024కు సంబంధించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పోలీసు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ రెవెన్యూ, పోలీసు అదికారులతో కమ్యూ నికేషన్ ప్లాన్, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతులపై ఇప్పటికే రెవెన్యూ అధికారులు పరిశీలించి వసతులు లేని పక్షంలో వసతుల కల్పనకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలోని 1,762 పోలింగ్ కేంద్రాల్లో 1,266 పోలింగ్ కేంద్రాలు లోకేషన్లలో వున్నాయని, దీనికి గల నెట్‌వర్క్ వసతులను పరిశీలించడం జరిగిందని, నెట్‌వర్క్ సమస్య వున్న పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ రోజున జిల్లా కేంద్రంకు సమాచారం చేరవేయడానికి నెట్‌వర్క్ సమస్య ఉత్ప న్నం కాకుండా చర్యలు చేపట్టడానికి రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, అడ్మిన్ఎఎస్పీ ఆరీఫుల్లా, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు,పలమనేరు ఆర్డీఓమనోజ్‌రెడ్డి, చిత్తూరు ఎస్‌బి డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సుధీర్‌తోనే బొజ్జల మంత్రి పదవి పోయింది : ఎమ్మెల్యే బియ్యపు



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త : గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మంత్రి పదవి పోవటానికి కారణం ఆయన తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డి పుష్ప అవతారమే అని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం రూ.53కోట్లతో స్వర్ణముఖి నదిపై నిర్మించనున్న ఆనకట్ట పనులకు ఆయన శంకుస్థాపన చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొజ్జల సుధీర్‌రెడ్డిపై ధ్వజమెత్తారు.నాలుగు సంవత్సరాలు హైదరాబాదులో మకాం వేసిన సుధీర్‌రెడ్డి ప్రస్తుతం పుష్ప3 ట్రైలర్ వేస్తున్నాడని ఎర్రచందనంస్మగ్లర్‌ను గెలిపిస్తే నియోజకవర్గం ఏమైపోతుందని ధ్వజమెత్తారు.ఈ అంశానికి సంబంధించి ప్రజలు ఆలోచించాలన్నారు.

**ఎన్నికల ముందు చెత్త పోయింది:**

తాను ఏకగ్రీవం చేసిన కొందరు తనను వదలి వెళ్ళితే నా వెంట వేలాది మంది ఉన్నారన్నారు. ఎన్నికలముందే చెత్త వెళ్ళటం మంచిదే అన్నారు.30సంవత్సరాలో బొజ్జల కుటుంబం చేయలేని అభివృద్ధిని రెండున్నర సంవత్సరాల కాలంలో తాను చేసాననిఇందుకు సంబంధించి ప్రజలకు ఇంటింటికి తెలియజేస్తామన్నారు. తాను చేసిన అభివృద్ధి అందించిన సేవలు అందుబాటులో ఉన్న వాతావరణాన్ని బట్టిమరో సారి తనకు అవకాశంకల్పించాలని సభలో కోరారు. 30 సంవత్సరాలు పరిపాలించిన కుటుంబం నియోజకవర్గాన్ని ఎందుకు అభివృద్ధి చేయాలేదని ప్రశ్నించారు. ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉండి కూడా స్వర్ణముఖిపై డ్యాం ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు.స్వర్ణముఖి ఆధునీకరణ,చెరువులు ఎందుకు బాగు చేయలేదని ప్రశ్నించారు.వారు అభివృద్ధి చేసి ఉంటే నేడు నాకు పని ఉండేదా?అని శాసనసభ్యుడు ధ్వజమెత్తారు. ఎంపి గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గం అభివృద్ధి చెందనంతగా శ్రీకాళహస్తి నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 20వేల కోట్లఅభివృద్ధి పనులు జరిగాయని వివరించారు.ఈ కార్యక్ర మాల్లో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు శ్రీనివాసులు,ఇఇ మదనగోపాల్ పలువురు పార్టీ నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

# స్రచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకు పాలన : మంత్రి ఆర్.కె.రోజా



పుత్తూరు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త : సచివాలయాల వ్యవస్థ తీసుకువచ్చి ప్రజల ముంగిటకు పాలనను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగనో ్మహనరెడ్డికి దక్కుతు ందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె. రోజా అన్నారు. రూరల్ మండలంలోని గోపాలకృష్ణాపురంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. అలాగే రూ. 23.94 లక్షలతో రైతు భరోసా భవనం, రూ. 20.30 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల వివిధ అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి దగ్గరే పథకాలు అందిస్తున్నారు. రైతు సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు సరైన ఆరోగ్యం కోసం వెల్ నెల్ సెంటర్లు మంజూరు చేసినట్టు తెలిపారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెల్ సెంటర్లు వున్నాయా అని ప్రజలను ప్రశ్నించారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రిగా అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకువస్తారన్నారు. నగరిలో ముచ్చటగా తనను మూడోసారి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

**పొంగల్ షెడ్ ప్రారంభోత్సవం**

పట్టణంలోని ఆరేటమ్మ ఆలయంలో రూ. 6లక్షలతో నిర్మించిన పొంగల్ షెడ్, రూ. 9 లక్షలతో నిర్మించిన ఆర్చ్‌లను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మంత్రికి మేళతాళాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధి కోసం కమిటీ మరింత కృషి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్లు డి.జయప్రకాశ్ (చిట్టి), డి.శంకర్, ఆలయ కమిటీ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి, నాయకులు కె.టి.ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేటి సాయంత్రం షార్ నుంచి రాకెట్ ప్రయోగం

## - ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
## - జిఎస్ఎల్‌వి ఎఫ్14 ప్రయోగానికి ముందు శ్రీహరికోట అప్రమత్తం







శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 16 ప్రభాతవార్త : శ్రీహరికోట నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు జిఎస్ఎల్‌వి ఎఫ్14 రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఇన్‌శాట్ 3డిఎస్‌ఉపగ్రహాన్ని ఈ రాకెట్ 19 నిమి షాల వ్యవధిలో కక్ష్యకు చేర్చనుంది. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్వర్యంలో షార్‌లో శాస్త్రవేత్తలు ప్రయోగ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ ఏడాది జరుగుతున్న రెండవ రాకెట్ ప్రయోగం ఇది. సాధారణంగా జిఎస్ఎల్‌వి ప్రయోగాలంటేనే శాస్త్రవేత్తలు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. అయితే అవరోధాలను అధిగమించి, అగ్రరాజ్యాల ఆంక్షలను తట్టుకొని సొంతంగా అతి శీతల ఇంధనమైన క్రయోజనిక్‌ను రూపొందించుకొని ఇప్పుడిప్పుడే జిఎస్ఎల్‌వి రాకెట్లను రూపొందించు కొంటున్నారు. ఈ భారీ ఉపగ్రహ ప్రయోగ వాహక నౌకలకు శ్రీహరికోట ఎంతో అనుకూలంగా ఉంది. ముఖ్యంగా ఇక్కడి రెండవ ప్రయోగ వేదిక నుంచి జిఎస్ఎల్‌వి తరహా రాకెట్లను నేర్పుగా ప్రయోగించేందుకు సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నారు. రాకెట్ ప్రయోగానికి ముందు శ్రీహరికోటతో పాటు సమీప దీవులను అప్రమత్తం చేశారు. షార్‌లో అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. సూళ్లూరుపేట, శ్రీహరికోట మధ్యలోనూ వాహనాల రాకపోకలు ఎక్కువ కావడంతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం ప్రయోగానికి ఈసారి వీక్షకులు కూడా విజిటర్స్ గ్యాలరీకి ఎక్కువ సంఖ్యలో తరలివస్తారని అంచనా వేస్తున్నారు.

## కన్నులు చాలవే...చారాల తిరుణాళ్ళు చూడ...!

చారాల(చౌడేపల్లి), ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

పంచాయతీ కేంద్రం చారాలలో శుక్రవారం ఉట్లోత్స వాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. రథసప్తమి (సూర్యజయంతి)సందర్భంగా గ్రామస్తులందరూ తిరుణా ళ్ళను ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. గ్రామానికి సమీపంలోని శ్రీ అన్నపూర్ణా ్ణంబ సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి తొలి పూజలందుకొన్నాడు. రాత్రి శివపార్వ తులు ఇంటింటా పూజలందుకొన్నారు.

## ఎగువ తవణంపల్లెలో టీడీపీ అభ్యర్థి ప్రచారం

తవణంపల్లె, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతునివ్వాలని కోరుతూ పూతలపట్టు టీడీపీ అభ్యర్థి డాక్టర్ కె.మురళీమోహన్ శుక్రవారం ఎగువ తవణంపల్లె గ్రామ పంచాయతీపరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దిలీప్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి మధుకు మార్ యాదవ్, మాజీ జడ్పీటీసీలు కోదండయ్య,వెంకటేశ్వర చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్ నాయుడు, నాయకులు వినాయకం, చిట్టెమ్మ, షబ్బీర్‌బాషా, గాంధీ, శరవణకుమార్, జయపాల్, రవి, శోభన్‌బాబు, గోపీ, రవిచంద్రారెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



## నవరత్నాల పథకాలు బూటకమే - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

**శాంతిపురం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త** సిఎం జగన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాలు పథకాలు బూటకమేనని ప్రజలకు ఇచ్చిన మాటతప్పిన వ్యక్తి సిఎం జగన్ అనిమాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసు లు పేర్కొన్నారు. శాంతిపురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా పేరిట ప్రతి రైతుకు ఐదేళ్లలో యాభై వేలు ఇస్తామని అధికారంలో రాగానే మాట మార్చారన్నారు.

## సిఎం జగన్ బహిరంగ సభకు ఏర్పాట్లు

శాంతిపురం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

శాంతిపురం మండలంలోఈనెలాఖరులో సిఎంజగన్ పర్యటన ఉన్న నేపథ్యంలో సిఎ ం పర్యటన ఏర్పాట్లను అధికారులు, నేతలు చేపడుతున్నారు. మఠం వద్ద బహిరంగసభ నిర్వహణకు స్థలాన్ని చదును చేస్తున్నారు. ఎమ్మెల్సీ ్స భరత్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్‌లు పనులను పర్యవేక్షిస్తున్నారు. వాహనాల పార్కి ంగ్ కోసం సైతం ఏర్పాట్లు చేస్తున్నారు.

## మైనార్టీల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

**శాంతిపురం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త** మైనార్టీల అభివృద్ధి తెదేపా అధినేత చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని కుప్పం టిడిపి పరిశీలకుడుగాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఎంకె పురంలో స్థానిక నేతలతో కలసి ఆయన ఇంటింటా కరపత్రాలు పంచారు. కార్యక్రమాల్లో నేతలు సర్దార్, అన్సర్, ముజీబ్, హైదర్,అబ్బాస్, షేక్ బాషా, సల్మాన్, షబ్బీర్, కలీం, లతీఫ్ పాల్గొన్నారు.

## నోరు అదుపులో పెట్టుకోకుంటే డిప్యూటీ సిఎం అవినీతి చిట్టా బహిర్గతం

– జిడి నెల్లూరు నియోజకవర్గ 'దేశం' ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్

పాలసముద్రం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:



డిప్యూటీ సిఎం నారాయణస్వామి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడ కుంటే ఆయన అవినీతి చిట్టాను బహిర్గతం చేస్తానని జిడినెల్లూరు నియోజకవర్గ 'దేశం' ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బలిజకండ్రిగ ఎన్టీఆర్ కూడలి నుండి కృష్ణజిమ్మాపురం కొండం గ్రామం వరకు నియోజకవర్గ 'దేశం' ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ థామస్ మాట్లాడుతూ మండలంలో డిప్యూటీ సిఎం నారాయణస్వామి బిసీలకు తీరని అన్యాయం చేశారని, వారి భూములను బలవంతంగా లాక్కొని వారిని అణచివేశారని, వారిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులు చేశారన్నారు. డిప్యూటీ సిఎం నారాయణస్వామి పదవి కోసం రాత్రి వేళల్లో కాళ్ళు పట్టుకొంటున్నారని ఈ విషయంను ఆయన మేనల్లుడు బహిర్గతం చేశారని ఆరోపించారు. జిడినెల్లూరు నియోజకవర్గంలో వున్న ఇసుక, ఎర్రచందనం, గ్రానైట్ తదితరాలను అక్రమ మార్గాల్లో ఇతర రాష్ట్రాలకు తరలించి కోట్లు కొల్ల గొడుతున్నారన్నారు. ఇది కాకుండా బస్సు ఛార్జీలు, ఎలక్ట్రానిక్ బిల్లులు, లిక్కర్ బిల్లులు స్వాహా చేస్తున్నారన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా వున్న నియోజకవర్గంలో నీవు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే మెగా డిఎస్సీ పేరిట మినీ డిఎస్సీ నోటిఫికేషన్ జారీ ప్రభుత్వం నిరుద్యోగ ఉపాధ్యాయులను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు దాముర్రెడ్డి, రవిప్రకాష్, సిఆర్ రాజన్, కోదండయాదవ్, బిసీ నాయకులు షణ్ముగరెడ్డి, రవియాదవ్, శ్రీధర్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, రుద్రయ్యానాయుడు, జయశంకర్‌నాయుడు, స్వామిదాసు, హేమాద్రియాదవ్, వేలాయుధం, ప్రసాద్, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీడీఓగా కుసుమకుమారి బాధ్యతల స్వీకరణ

**ఐరాల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** ఐరాల ఎంపీడీఓగాకుసుమకుమారి బాధ్య తలు స్వీకరించారు. ఎన్ని కల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా ఒక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న నాగరాజు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో మండలఈఓపీఆర్‌డీగాపనిచేస్తున్నకుసుమకుమారినిపూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది.

## కాణిపాకంలో నిత్య భజనలు ప్రారంభించాలి

కాణిపాకం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో నిత్య భజనలు ప్రారంభించాలని జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కళాకారులు తరపున శుక్రవారం ఆలయ అధికా రులకు వినతిపత్రం అందజేశారు. గతంలో దేవస్థానంలో నిత్యభజనలు జరుగుతుండేవని, కరోనా నేపథ్యంలో వాటిని రద్దు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తిరిగి ఈకార్యక్రమాలను పున:ప్రారంభించాలని కోరుతూ ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి బంగారు మురళి ఆలయ ఏఈఓకు రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు.

## తెలుగువైభవానికి ప్రతీక శ్రీకృష్ణదేవరాయలు



**పుంగనూరు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** తెలుగుజాతిపౌరుషాన్ని,సాహితీవైభవాన్నిదిగంతాలకు చాటిన శ్రీకృష్ణదేవ రాయలు తెలుగువైభానికి ప్రతీకగా భాసిల్లారని పలువురు కొనియాడారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల 553వ జయంతి సందర్భంగా స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజసేవాసంఘం అధ్వర్యంలో కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది సంఘసభ్యులు పాల్గొన్నారు.



## బంగారుపాళ్యం ఎంపిడిఓగా శివశంకర్

**బంగారుపాళ్యం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** బంగారుపాళ్యం ఎంపిడిఓగా జి.శివశంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా రామాపురంలో ఎఓగా విధులు నిర్వహిస్తూ ఎంపిడిఓగా పదోన్నతి పొందారు. జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇన్‌ఛార్జీ ఎంపిడిఓగా విధులు నిర్వహిస్తున్న హరిప్రసాద్‌రెడ్డి నుండి ఎంపిడిఓగా శివశంకర్ బాధ్యతలు స్వీకరించారు.

## ద్రవిడ వర్సిటీలో ఘనంగా శ్రీకృష్ణదేవరాయలజయంతి వేడుకలు



**కుప్పం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త** ద్రవిడ వర్సిటీలోని భాషా భవన్ వద్ద శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను వర్సిటీ లైజనింగ్ అధికారి డా॥ జ్యోతమ్మ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భాషాభవన్ ఎదుట రాయల విగ్రహానికి వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.మధుజ్యోతి, రెక్టార్‌ఆచార్య అనురాధ, రిజిస్ట్రార్ ఆచార్య వేణుగోపా ల్‌రెడ్డి, అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ శారదలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు, పిఆర్వో దుర్గా ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఎట్టకేలకు రాజధాని ఫైల్స్ చిత్ర ప్రదర్శన

**కుప్పం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త** కుప్పంఎస్‌ఆర్‌ఎం సినిమా థియేటర్‌లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాజధాని ఫైల్స్ చిత్రాన్ని ప్రదర్శించారు. గురువారమే ఈచిత్రం విడుదల కాగా హైకోర్టు ఇచ్చిన స్టే మేరకు చిత్ర ప్రదర్శన నిలిపేశారు. అయితే శుక్రవారం హైకోర్టు స్టే వెకేట్ చేసిందనే సమాచారంతో చిత్రాన్ని మధ్యాహ్నంపైన ప్రదర్శించారు.



## రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మానక్ పోటీలకు దీక్షిత ఎంపిక

**కుప్పం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త** స్థానిక విజయవాణి విద్యా సంస్థల్లో పదవ తరగతి చదువుతున్న దీక్షిత అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మానక్ 2023 పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ డా॥ భాగ్యరాజ్ ప్రభంజన్, డైరెక్టర్ డా॥ సుభాష్ రాజా తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో దీక్షిత ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల బాలికలను వారు అభినందించారు.

## చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ సాధనే లక్ష్యం

కుప్పంరూరల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు ఈసారి కుప్పంలో లక్ష ఓట్ల మెజార్టీ సాధనే లక్ష్యమనినియోజకవర్గ వన్నియకులక్షత్రియ యువత అధ్యక్షుడు సతీష్‌కు మార్, ప్రధాన కార్యదర్శి రామూర్తి తెలిపారు. శుక్రవారం మంకలదొడ్డి పంచాయతీ అత్తూరులో ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు పన్నీరు,ఈశ్వర్, రాజశేఖర్, గణపతి,సురేష్, గణేష్‌కుమార్, చంద్రప్ప, వినోద్, గణపతి, ప్రశాంత్, బాబు, వంశీ, మురళి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సంక్షేమపథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్ళాలి

**పెద్దపంజాణి ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రభుత్వసంక్షేమపథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలనిఎంపిపిరెడ్డెప్ప,మండలవైకాపాకన్వీనర్ బాగారెడ్డి కోరారు. శుక్రవారం రాజుపల్లి ఆర్‌బికె కేంద్రంలో వైకాపా నాయకులు,కార్యకర్తలతో ఆత్మీయ సమా వేశం నిర్వహించారు. గతంలో ఏముఖ్యమంత్రి అమలుచేయనిరీతిలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోసంక్షేమపథకాలను అమలు చేసారన్నారు. ఈ సమావేశం లో సింగిల్‌విండో అధ్యక్షుడు బాబురెడ్డి,వైకాపా జిల్లాకార్యదర్శి తమ్మిరెడ్డి, నేతలు రాజారెడ్డి,పూల శంకర్‌రెడ్డి,మోహన్‌రెడ్డి,కృష్ణప్ప,శంకరప్ప పాల్గొన్నారు.

## శక్తిస్వరూపిణీకి రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

బోయకొండగంగమ్మ ఆలయంలో శక్తిస్వరూపిణీకి రాహుకాలాభిషేకం జరిగింది. ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ చేశారు. రాహుకాల సమ యంలో దంపతుల సమక్షంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. శిబిరానికి పలమనేరుకు చెందినసిఎస్.నవీన్‌కుమార్ ఆయన మిత్రులు కూరగా యలు, గరిగపల్లిఎ.భాస్కర్‌రెడ్డి రూ. 5,116లు, కొంగనహళ్ళి కెవి కృష్ణప్ప రూ. 5వేలను అన్నదానానికి విరాళంగా అందించారు. ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఒ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచు చొరవతో తీరిన దాహార్తి

**గడ్డంవారిపల్లి(చౌడేపల్లి), ఫిబ్రవరి 16 ప్రభాతవార్త** మాజీ సర్పంచ్‌చొరవ చూపడంతో గ్రామంలో నెలకొని వున్న మంచినీటి సమస్య తీరింది. గడ్డంవారిపల్లి బిసి కాలనీలో గత 2నెలలుగా మంచినీటి సమస్య నెలకొంది. ఈ విషయమై అధికారులకు తెలిపినా ప్రయోజనం కనిపించలేదనీ, దీంతో గతంలో తన హయాంలో వేసిన పాతబోరుకు స్నేహితుడు శ్రీరాములు సహకారంతో నూతన కొత్తమోటారు అమర్చి మంచినీటి సరఫరా చేసినట్లు మాజీ సర్పంచ్ వెంకట్రమణ తెలిపారు.

## 7రోజుల పాటు ధ్యాన మహాయజ్ఞం

**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** కాణిపాకం సమీపం సిద్దంపల్లెలో వెలసిన శ్రీవిఘ్నేశ్వర మహాశక్తిక్షేత్రంలో ఈనెల 18 నుంచి24వరకు 7రోజుల పాటు ధ్యాన మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ స్పిరిచ్యువల్‌ట్రస్ట్‌వ్యవస్థాపకఅధ్యక్షుడు డా.బి.గోపాలక్రిష్ణమూర్తి తెలిపారు. ఈ మహాయజ్ఞంలో పాల్గొనే వారందరికీ వసతి, భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వివరాలకుసెల ్‌నెం.94402 66653, 9490906653 లను సంప్రదించాలని కోరారు.

## నృత్య ప్రదర్శనలో నడిగడ్డ బాలికకు ద్వితీయ బహుమతి

**సదుం ఫిబ్రవరి16ప్రభాతవార్త** మండల పరిధిలోని నడిగడ్డకు చెందిన బాలికకు నృత్య ప్రదర్శనలో ద్వితీయ బహుమతి లభించింది. హైదరాబాదులో రెండు రోజుల క్రితం నటరాజ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నృత్య పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో సదుం మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన బాబురావు, ప్రశాంతిల కుమార్తె శ్రీనాట్య మణిబాలచార్విశ్రీ ద్వితీయ బహుమతి సాధించారు. ఈమెకు నిర్వహకులు అయోధ్య బాలరాముడి పుష్కరం-2024 అవార్డును అందజేశారు.

## అందుబాటులో వుంటా,ఆదరించండి : సునీల్ కుమార్

**తవణంపల్లె, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** అందరికి అందుబాటులో వుంటా... వచ్చేఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని పూతలపట్టువైకాపాఅభ్యర్థిడాక్టర్‌సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం అరగొండలో నాయకులు, కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైకా పా అభివృద్ధికి జెండా మోసిన ప్రతి కార్యకర్తకు తాను న్యాయం చేస్తానన్నారు. మండల వైకాపా కన్వీ నర్ సిద్దంపల్లె హరిరెడ్డి,వైకాపా సీనియర్ నాయకులు గురుకువారిపల్లె ప్రకాష్‌రెడ్డి, గాంధీ బాబు, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకర మధుకు మార్,అరగొండ రాజేశ్వరమ్మ ,కిషోర్‌కుమార్‌రెడ్డి,బాబురెడ్డి, పరమేశ్వరరెడ్డి, రమణారెడ్డి, సతీష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

## పంటకు గిట్టుబాబు ధర కల్పించే చట్టం చేయాలి

తవణంపల్లె, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:

రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించే చట్టం చేయాలని, స్కీం వర్కర్లును ప్రభుత్వ ఉద్యోగులుగా గురించాలని ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మెలో భాగంగా వినాయకపురంలో ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలసి ప్రదర్శన నిర్వహించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## చిట్టేడులో వైఎస్సార్ కంటి వెలుగు

కోట,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

మండలపరిధిలోని చిట్టేడు ఉపఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా కోట ఎంపిడిఓశంకరయ్యహజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లా డుతూ కంటి వెలుగు స్కీనింగ్ కింది54 మంది,టెస్ట్‌లో 201మందికి చికిత్సలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు,శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గూడురులో గ్రామీణ బంద్ విజయవంతం

గూడూరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త



గూడూరులో రాష్ట్రకమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం వామపక్షాల, ప్రజా సంఘాలు, ట్రేడ్ యూనియన్లు ఆధ్వర్యంలో జయప్రదం చేసారు. అనంతరం టవర్ క్లాక్ సెంటర్ నుండి ప్రదర్శనగా వెళ్ళి ఆర్డీఓ ఆఫీస్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాల సుబ్రమణ్యం, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య,కార్యదర్శిఎస్.సురేష్,కెవిపిఎస్‌నాయకులుఅడపాల ప్రసాద్, పామంజి మణి, ఆటో కార్మిక సంఘ నాయకులు బి. రమేష్, ఎస్‌కె మహబూబ్ బాషా, భవన నిర్మాణ సంఘ నాయకులు సేలంశేఖరాచారి, జి.మధు, మున్సి పల్ కార్మిక సంఘం పట్టణకార్యదర్శిదారాకోటేశ్వరరావు, భూలోక మురళి, సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిహెచ్ ప్రభాకర్, సిపిఐ నాయకులు ఎస్‌కె కాలేషా, సివిఆర్ కుమార్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశికుమార్, ఏఐటియుసి నాయకులు ఎంబేటి చెంద్రయ్య,పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

గూడూరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త



స్థానిక సంఘం థియేటర్ కూడలి వద్ద శుక్ర వారం హిరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్టు ఆధ్వ ర్యంలో శ్రీకృష్ణ దేవరాయలు జయంతి సంద ర్భంగా రాష్ట్ర కాపు నాడు కార్యదర్శి కంకణాల పెంచల నాయుడు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు స్వీట్లు పంపిణీ చేశారు.

## ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటు పరం చేయనీయం



రైతు కూలీ సంఘం

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నట్లు జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి వివి రమణయ్య తెలిపారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా వెంకటగిరి పురవీధులలో ర్యాలీనిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు జాన్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జంగయ్య,వ్యవసాయకార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి కచేపల్లి అంకయ్య, స్ట్రీట్ వండర్స్ జిల్లా అధ్యక్షులు మునేంద్ర, జయకృష్ణ, బండి కుమార్, వి. శివ, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సిద్ధం కావాలి



నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

బాలాయపల్లి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త

త్వరలో జరిగే ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలని వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి కోరారు. బాలాయపల్లిఎంపిపి భాస్కర్ రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ భాస్కర రావు, సొసైటీ అధ్యక్షులు కార్తీక రెడ్డి తదితర నాయకులను ఆయన కలిసి ఎన్నికల వ్యూహం పై చర్చించారు. ఆయన వెంట నాయకులు రమేష్ చౌదరి తదితరులు ఉన్నారు.

## సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉంది

డిఐజి రాజకుమారి



వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త

బెటాలియన్ సిబ్బందిపనితీరు సంతృప్తికరంగా ఉందని ప్రత్యేక పోలీస్ బెటాలి యన్స్ డిఐజి రాజకుమారి తెలిపారు. స్థానిక ఏపీఎస్పీ 9వ బెటాలియన్ రెండవ రోజు వార్షిక తనిఖీ చేసారు. సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. 9వ బెటాలియన్ సిబ్బంది పనితీరు బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ ప్రకాష్, అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్, అసిస్టెంట్ కమాండెంట్స్ ఎంఎల్ మనోహర్, ఆనంద్ కన్నా, రామకృష్ణ, ఏవో చంద్రమౌళీ, డాక్టర్స్ శేషమ్మ, కిరణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడి మహిళమృతి

కోట,ఫిబ్రవరి 16 ప్రభతవార్త

మండలపరిధిలోని చమడిపాళెంకు చెందిన సూళ్లూరు శైలజ (30) బావిలో పడి మృతి చెందిందని కోటఎస్.పి.నాగబాబు చెప్పారు,పొలంలో పనిచేస్తుండగా ఆమె బావిలోపడిందన్నారు.ఆమెకుఒకకుమార్తె, బాబు,భర్తమహేష్‌తోకలసి వెంకనపాళెం లో కాపురం ఉంటూమిరప తోట సాగు చేస్తుజీవిస్తున్నారు. అమ్మ ... అమ్మ అంటూ ఆ చిన్నారులు విలపించడం పలవరిని కంటితడి పెట్టించింది. పోస్టు మార్టం నిమిత్తం మృత దేహాన్ని తరలించారు. ఎస్.నాగరాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా రథ సప్తమి వేడుకలు

గూడూరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త



రథసప్తమి సందర్భంగా గూడూరు శ్రీఅళఘనాథ స్వామి దేవస్థానంలో గురువారం రథసప్తమి సంద ర్భంగా స్వామి వారు సూర్యప్రభ వాహనంపై దర్శన మిచ్చారు. మంగళవాయిద్యాలతో మాడవీధి ఉత్స వం నిర్వహించారు. అనంతరం తూర్పు వీధిలోని స్వామి వారినాలుగుకాళ్లమండపంలోపూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధుల డుమ్మా

చిల్లకూరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వ హించాలని అధికారులకు ఎంపిటిసిలు సర్పంచులకు సమాచారం అందించింది. అయితే మధ్యాహ్నం 12 గంటలు అయినా 13 మంది ఎంపిటిసిలు, 30 మంది సర్పంచులు ఉండగా ఇద్దరు ఎంపిటిసిలు మాత్రమేహాజరయ్యారు. ఎంపిడిఓ భానుమూర్తి ప్రజాప్రతినిధులకు ఫోన్ చేయగా ఏ ఒక్కరు స్పందించలేదు, ప్రజాప్రతినిధులు హాజరు కాకుండా పోవడానికి ప్రభుత్వం పై వ్యతిరేక విధా నమేనా లేకుంటే ఇంకేమైనాకారణం ఉందా తెలియాల్సి ఉంది. వైసిపి ప్రభుత్వంలో గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లక్షల్లో అభివృద్ధి పనులు చేపట్టి బిల్లులు రాక అప్పులపాలు అయినటువంటి పరిస్థితి నెలకొని ఉందని ఇది కూడా ఒక కారణమై ఉండవచ్చా తెలియాల్సి ఉంది. ఎంపిడివో భానుమూర్తిని వివరణ కోరగా కనీసం నలుగురు ఎంపిటిసిలు హాజరైతేనే సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని ఇద్దరు ఎంపిటిసిలు రావడంతో వాయిదా వేసారు.

## వెంకటగిరి టిక్కెట్ బీసీలకు ఇవ్వండి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త



వెంకటగిరి అసెంబ్లీ టికెట్లను ప్రధాన పార్టీలు బీసీలకు ఇవ్వాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు ఓటూరు సంపత్ రాజు తెలిపారు. వెంకటగిరి ఏవిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము ఓట్లు వేస్తే అగ్రకులాల వారు సీట్లు పొందుతున్నారని తెలిపారు. నియోజకవర్గం బిసిలకు టికెట్లుఇవ్వాలనికోరారు. సమావేశంలోమాజీ ఎంపిటిసితోటరామచంద్రయ్య, సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

## రైతు కార్మిక విధానాలను ఖండించాలని

వెంకటగిరి ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:



రైతు కార్మిక ప్రజావ్యతిరేక ఫాసిస్టు బిజెపి ప్రభుత్వా విధానాలను ఖండించా లని సిపిఎం నాయుకులు వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. శుక్ర వారం బంద్ నిర్వ హించారు. ఈకార్యక్రమం లోసిపిఐ నాయకులుపల్లిపాటి బాలకృష్ణ.జాన్ తదితరులు కార్యక్రమం లో పాల్గొన్నారు.

## రాజాధాని ఫైల్స్‌ను అడ్డుకోవడం పిరికి చర్య : కురుగుండ్ల

వెంకటగిరి ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:



ప్రజల ఆకాంక్ష రాజాధాని అమరావతి ని నిర్మించకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి తీరుపై తీసిన రాజాధాని ఫైల్స్ సినిమాను రాష్ట్ర ప్రజలు చూడకుండా తన అధికారంతో అడ్డుకోవడం జగన్‌పిరికి చర్యఅని మాజీ ఎమ్మెల్యే కురుగండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లడుతూ సిఎం జగన్‌మోహన్ రెడ్డి అమరావతి రాజధాని లేకుండా చేసిన మోసాన్ని చూసి ప్రజలు తనకు ఓట్లువేయరనే భయం తోనే సినిమాను నిలుపుదల చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా వందల కోట్లురూపాయులతో వెంకటగిరిలో అభివృద్ధి పనులు చేశామని, అయినా వైసిపి వెంకటగిరి కన్వీనర్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి మాత్రం నేను ఎలాంటి అభివృద్ధి చేయలేదనడం దారుణమన్నారు. నేదురుమల్లి ఏడాదిగా అధికారంలో ఉండి ఏమిఅభివృద్ధి చేశారో ప్రజలకు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ ఎయంసి ఛైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు,వెంకటగిరి రూరల్ టిడిపి పార్టీ అధ్యక్షుడు పప్పుచంద్రమోహన్‌రెడ్డి,టిడిపి తెలుగు యువత రాష్ట్ర నాయకులుకెవికేప్రసాద్, పాల్గొన్నారు.

## పురందేశ్వరితో బిజెపి నేతల భేటీ

వాకాడు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త



రాష్ట్ర బిజెపిఅధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన గురువారం నెల్లూరు లో ఐదు జిల్లాల ఎలక్షన్ మేనేజ్మెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో తిరుపతి జిల్లా, గూడూరు నియోజకవర్గ కన్వీనర్ పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు. గూడూరు నియోజకవర్గంను గురించి పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి ప్రత్యేకంగా చర్చించారు.

**కోట :** పురందేశ్వరిని శుక్రవారం రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులుపనబాకకోటేశ్వరరావుమర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తానని పురంధేశ్వరికి వివరించారు.



## తడలో ఎర్రజెండా రెపరెపలు

తడ, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

దేశంలోని పలు రైతుసంఘాల పిలుపు మేరకు శుక్రవారం జరిగిన భారత్‌బంద్‌లో భాగంగా తడలో సిపిఐ ఆందోళన చేపట్టింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలు ఎగురవేస్తూ స్థానిక బజారువీధులు, జాతీయ రహదారిపై నినాదాలు చేశారు. ఈసందర్భంగా స్థానిక కూరగాయల వ్యాపారులు వీరికి సంఘీభావంగా ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం బజారులో కరపత్రాలు పంచిపెట్టారు. శ్రీనివాసులు, వెంకటేష్, కుమార్ పాల్గొన్నారు.



## తడ ఆలయాల్లో రథసప్తమి వేడుకలు

తడ, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

రథసప్తమి పర్వదినంసందర్భంగా శుక్రవారం తడ మండలంలోని పలు ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. పన్నంగాడు, బోడిలింగాలపాడు, తడ, వేనాడు, వాటంబేడు ఆలయాల్లో రథసప్తమికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినమాంబట్టులో ఉన్న శ్రీకాశీ విశ్వే శ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి అలంకరణలు చేశారు. టిటిడి వారి చే సాంస్కృతిక కార్యక్రమాలు, గోపూజ నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఇక్కడ అన్నపూర్ణ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పర్వతరెడ్డి రవమ్మ, బాలకృష్ణారెడ్డి పేర్ల మీద వారి కుటుంబ సభ్యులు తిరుమూరు సుజాతమ్మ, సుధాకర్‌రెడ్డిలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అన్నపూర్ణ అన్నదాన సమాజం వ్యవస్థా పకులు, తిరుపతి స్విమ్స్ వైద్యులు కారణి మునుస్వామి, ఆలయ కమిటీ ఛైర్మన్ చేజర్ల ముని శ్రీనివాసులు, అన్నదాన కమిటీఛైర్మన్‌చిల్లకూరుదేవేంద్రరెడ్డి, పర్వతరెడ్డి తిరువూరి రవి,మల్లికార్జునరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## 21న మండల సమావేశం

**తవణంపల్లె, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** తవణంపల్లె మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 21న జరుగుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎంపీపీ గీత అధ్యక్షతన జరుగుతుందన్నారు.

## మూడు రాజధానుల పేరిట దోపిడీ చేశారు - తెదేపా

**కుప్పంరూరల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త** రాష్ట్రానికి మూడు రాజధానుల పేరిట సిఎం జగన్‌రెడ్డి అండ్ కో నిలువు దోపిడీ చేశారని తెదేపా రైతు సంఘం నేతలు చలపతి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏరా ్పటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబునాయుడు ప్రారంభించిన అమరావతి రాజధాన్ని అడ్డుకున్నారన్నారు. 34వేల మంది రైతుల త్యాగాలు అమరావతి అన్నారు. సమావేశంలో నేతలు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జెసి ఆధ్వర్యంలో ధర్నా
శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

నేడు ఉదయం10గంటలకు శ్రీకాళహస్తి జెసి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి తాలూకా కార్యాలయం ఎదుట తమ డిమాండ్ల సాధనకోసం ధర్నా నిర్వహిస్తున్నట్లు జెసి ఛైర్మన్ మరియు శ్రీకాళహస్తి తాలూకా ఎన్జీజో అధ్యక్షుడు సి.చెంచురత్నంయాదవ్ తెలిపారు.



## అహో...ఆంధ్రభోజా!
కృష్ణదేవరాయలుకు పుష్పాంజలి

తిరుపతి,ఫిబ్రవరి 16ప్రభాతవార్త:

శ్రీకృష్ణదేవరాయలు జయంతి సందర్భంగా తిరుపతి లీలామహల్ కూడలిలోని ఆయన విగ్రహానికి రాయలసీమ రంగస్థలి పుష్పాంజలి అర్పించింది.

## వైసిపిని సాగనంపేందుకు ప్రజలు సిద్దం
– గాలి భానుప్రకాశ్

పుత్తూరు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :



వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్దంగా వున్నారని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ అన్నారు. శుక్రవారం పుత్తూరు రూరల్ మండలం పరిధిలోని వేప గుంట, పరమేశ్వర మంగళం పంచాయతీల్లో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి దుర్మార్గపు, చేతకాని పరిపాలనకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.గ్రామాల్లో భానుప్రకాశ్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, అధికార ప్రతినిధి చినబాబు, రూరల్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రవికుమార్, బాలాజీ, పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎస్.ధనపాల్, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు డి.జి.ధనపాల్, మునిసిపల్ మాజీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లు యుగంధర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## బృందమ్మ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం
శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త



బృందమ్మ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం నెలకొంది. శుక్రవారం తాగునీటి సమస్యను బొజ్జలరిషితారెడ్డితో వివరించగా స్పందించిన ఆమె వెంటనే నియోజకర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డికి తెలపగా సొంత నిధులతో బోరు వేయించి కాలనీకి తాగునీటి సమస్యను పరిష్కరించారు.ఈసందర్భంగా కాలనీ వాసులు బృందమ్మకు, రిషితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్, పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపినాథ్, వార్డు అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం కార్యాలయంలో అన్నదానం
శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

తొట్టంబేడు మండల మహిళా అధ్యక్షురాలు చెరుకూరి రమాదేవి, గోగినేని మురళీ నాయుడుల ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశంకార్యాలయంలో ఈనెల 7వ తేదీ నుంచి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పార్టీ కార్యాలయానికి వచ్చే కార్యకర్తలు, నాయకులు, నిరుపేదలకు సొంత నిధులు వెచ్చించి సుమారు రోజుకు 200మందికి అన్నదానం చేస్తున్నారు. శుక్రవారం అన్నదాన కార్యక్ర మాన్ని బొజ్జలబృందమ్మ ప్రారంభించి అన్నదానం చేస్తున్న రమాదేవిని అభినందించారు. కార్యక్రమంలో వెంకటేష్‌చౌదరి, శంకర్‌నాయుడు, పాండు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో వైభవంగా రథసప్తమి వేడుకలు
–మిని బ్రాహ్మోత్సవాలను తిలకించిన భక్తులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి16 ప్రభాతవార్త:



తుమ్మలగుంటలో రథ సప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రథ సప్తమినిపురస్కరించుకుని శ్రీకల్యాణ వెంకన్న ఆలయంలో మిని బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. మొదటగా సూర్యప్రభ వాహనంపై వెంకన్న ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.అనంతరం చిన్నశేష, గరుడ, హనుమంత్, కల్పవక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై భక్తులనుఅనుగ్రహించారు. సూర్య జయంతిని పురస్కరించుకుని రథ సప్తమినాడు సూర్యోదయం నుండి చంద్రోదయం వరకు సప్త వాహనాలపై స్వామి ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

## 3 నెలల పాటు ట్యాంకర్లతో నీటి సరఫరా
– దర్గా సర్కిల్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు –
మున్సిపల్ స్టాండింగ్ కమిటీ తీర్మానం



**చిత్తూరు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** రానున్న వేసవి దృష్టిలో వుంచుకొని చిత్తూరు నగర పరిధిలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో అవసరమైన మేరకు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరాకు మున్సిపల్ స్టాండింగ్ కమిటీ తీర్మానించింది. మేయర్ అముద అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చిత్తూరు దర్గా సర్కిల్ పరిసరాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడానికి రోడ్ సేఫ్టీ ఫండ్ నిధుల నుండి కేటాయించాలని సమావేశం తీర్మానించింది. అలాగే అర్హులైన అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరకు ఇరువారం రెవెన్యూ గ్రామం సర్వేనెం.515/5లో తహసిల్దారు గుర్తించి గయాలు 8.45 ఎకరాల భూస్వభావంను తహసిల్దారుతో మార్పు చేయడానికి పరిశీలనకు పంపగా కమిటీ ఆమోదించింది. అలాగే డోర్ టు డోర్ చెత్త సేకరిస్తున్న 11 ఆటో ట్రిప్పర్‌లకు సంబంధించి డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు, డిజీల్ మెకానిక్‌లను నెలవారి బిల్లుల నుండి మినహాయించుకొని చెల్లించడానికి, స్వీపింగ్ వాహనాలను నగరపాలక సంస్థ నిర్వహణ షరతుల మేరకు వాటి సేవలు కొనసాగించడానికి కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో కమీషనర్ డాక్టర్ జె.అరుణ, డిప్యుటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, సభ్యులు జిఆర్ శ్రీకాంత్, సహదేవన్, శోభ, పూర్ణచంద్రరావులు, అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, ఎంఇ గోమతి, పిసిపి రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి, సిఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల సంక్షేమం
– జిడినెల్లూరు నియోజకవర్గ 'దేశం' ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్

ఎస్ఆర్‌పురం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:



సిఎంగా చంద్రబాబునాయుడు వున్నప్పుడు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్ పేర్కొన్నారు. ముద్దుకుప్పం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భవిష్యత్తు గ్యారంటీ బాబు ష్యురిటీ కార్యక్రమంలో డాక్టర్ థామస్ పాల్గొని ఇంటింటికి వెళ్ళి పార్టీ ముద్రించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ థామస్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని ఆదరించి అధికారం అప్పగిస్తే నియోజకవర్గ పరిధిలోని రూపు రేఖలు మార్చుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నాయి. వీరికి పార్టీ కండువాలు కప్పి డాక్టర్ థామస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంథమనేని జయశంకర్‌నాయుడు, పార్టీ పరిశీలకులు రవిప్రకాష్, నాయకులు రాజశేఖర్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, కుమార్, మాధవ, మాదయ్య, బాలాజీ, గిరి, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యుటీ సిఎంకు మద్దతుగా బైక్ ర్యాలీ



**ఎస్ఆర్‌పురం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** డిప్యుటీ సిఎం నారాయణస్వామికి మద్దతుగా శుక్రవారం చొక్కమడుగు నుండి కొత్తపల్లిమిట్ట వరకు వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ గురువారెడ్డి, కొత్తపల్లి మాజీ సర్పంచ్ విజయబాబులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో డిప్యుటీ సిఎం నారాయణస్వామిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రస్తుతం వున్న ఊపు తరహాలోనే నాయకులు, కార్యకర్తలు ఎన్నికల పోలింగ్ రోజు వరకు పని చేసి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జనార్ధన్, ఎస్ఆర్‌పురం సర్పంచ్ హరిత కుప్పయ్య, కొత్తపల్లి సర్పంచ్ ధిల్లయ్య, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## రేపు జూనియర్ కబడ్డీ బాల బాలికల జట్లు ఎంపిక

**చిత్తూరు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ బాల బాలికల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.రవీంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల ఎంపికలో పాల్గొనడానికి బాల బాలికలు 55 కేజీల లోపు బరువు వుండాలని, 2008 మార్చి 19వ తేదీ తరువాత జన్మించి వుండి జనన ధృవీకరణ, ఆధార్ కార్డు ఒరిజినల్ తీసుకొని ఆదివారం ఉదయం 10 గంటలకు క్రీడా మైదానంలోకి హాజరు కావాలని కోరారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఈ నెల 21 నుండి 23 వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీల్లో చిత్తూరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

## జగనన్నకు ఓటేయండి : బియ్యపు పవిత్రరెడ్డి
ఏర్పేడు ఫిబ్రవరి16,ప్రభాతవార్త;



మహిళల అభివృద్ధి కోసం పాటు పడిన జగనన్నకే ఓటేయండని ఎమ్మెల్యే కుమార్తెగా కోరుతున్నానని ఎమ్మెల్యేబియ్యపు మధుసూధన్‌రెడ్డి తనయ బియ్యపు పవిత్రరెడ్డి కోరారు. గురువారం ఆమె ఇసుకతాగేలి పంచాయతీ పరిధిలోని బిసి కాలనీ, గోపాలపురం, రామాపురం, దళితవాడలో విస్తృతంగా సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియ జేస్తూ ప్రచారం చేశారు. అక్కా చెల్లెలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల రుణమాఫీ చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో మండలఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, వైస్‌ఎంపీపిశ్రీనివాసులయాదవ్,కోఆప్షన్‌మెంబర్‌బత్తిశెట్టి, ఎంపీటీసి జనార్ధన్‌రెడ్డి, సర్పంచి గురమ్మ తదితర వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఇల్లు ఒక పాఠశాల కావాలి: షకీల్ సాహెబ్
శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

నేడు సమాజంలో నెలకొన్న పరిస్థితి ముస్లిం సమాజానికి ప్రమాదకరంగా మారిందని తమిళనాడు ఇషారానికి చెందిన మత గురువు మౌలానా షకీల్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత అలాగే ఉదయం ఖుబామస్‌జిద్,మధ్యాహ్నం జామియా మస్‌జిద్, తరువాత మహిళల మదరాసాలో ఆయన ఆలోచనాత్మక ప్రసంగాన్ని అందించారు. అల్లాహ్ ఏడాదిలో ఒక్కొక్క మాసానికి ఒక్కొక్క ప్రత్యేకత కల్పించారన్నారు. రంజాన్‌కు సంబంధించి మహమ్మద్ ప్రవక్త రెండు నెలల ముందునుంచే ప్రార్థించే వారన్నారు. రంజాన్ కుముందు నెల షాబాన్‌లో ఆయన ఉపవాస దీక్షలు చేసే వారన్నారు. ఇస్లాం మతం ఈమాన్‌ను బోధిస్తుందన్నారు.నేడు మన పిల్లలను చక్కదిద్దుకొనుటకు ప్రతి ఇల్లు ఒక పాఠశాల కావాలన్నారు.

## శ్రీకాళహస్తి చేరిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహం



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

స్థానిక రాజగోపురం సమీపంలో పూర్వం ఇక్కడ నిర్మించిన రాజగోపురం రాజు శ్రీకృష్ణదేవరాయాల విగ్రహాన్ని ఏర్పాటు చేయటానికి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రయత్నించారు.ఆయన తన ప్రయత్నాన్ని పూర్తి చేయటానికి రాజ గోపురాన్ని పునర్నిర్మాణం చేసిన నవయుగ కన్‌స్ట్రక్సన్ వారిని అభ్యర్థించారు. వారు కాంస్య విగ్రహాన్ని ఇవ్వటానికి చైర్మెన్ అంగీకరించారు.ఈ మేరకు 580 కిలోల కాంస్య విగ్రహాన్ని అందించారు.ఈ విగ్రహాన్ని రాజగోపురం ఎదురుగా ఏర్పాటుకు సంబంధించి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు.

## సర్పంచ్‌లకు సర్వాధికారాలిస్తాం: రిషితా రెడ్డి
శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త



నాలుగేళ్ళలో ఏకగ్రీవంగా గెలిచిన పంచాయతీల్లో కూడా అభివృద్ధి శూన్యమని సర్పంచ్‌ల అధికారాలను ప్రభుత్వం హరించి వేసిందని దాంతో గ్రామీణాభివృద్ధి పడకేసిందని తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి వివరించారు. శుక్రవారం బీమవరం, పోలీ,వాంపల్లి,ఆంజనేయ పురం, మాదవగిరిపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు.ఆమెతో పాటు మండలా ధ్యక్షుడుకామేష్‌యాదవ్,క్లస్టంఇన్‌చార్జి రంగినేని చెంచయ్య నాయుడు, ఈశ్వరరెడ్డి, పాపిరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, గున్నయ్య, వెంకట కృష్ణయ్య.,కిషోర్, వెంకటేశ్వర యాదవ్,ర మేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సేవా కార్యక్రమాలే శ్రీరామరక్ష
.తొట్టంబేడు, షిబ్రవరి 16 ప్రభాతవార్త



పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగామార్చే పరిపాలన అందించేందుకు వైఎస్‌ఆర్‌సిపి పార్టీని మరోసారి గెలిపించేందుకు తొట్టంబేడు మండలం సిద్దంగా ఉందని ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి సతీమణి బియ్యపుశ్రీవాణి అన్నారు. శుక్రవారం మండలంలోని చోడవరంలో జగనన్న పథకాల ద్వారా లబ్ధిపొందిన వారితో మమేకవుతూ వారిని చిరునవ్వుతో పలకరిస్తూ జగనన్న పథకాలు అందుతున్నాయా?లేదాఅనితెలుసుకున్నారు.మరోసారితన భర్త బియ్యపుమధుసూ ధన్‌రెడ్డి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని ఇంకా అభివృద్ధి చేస్తానన్నారు. ముందుగా బియ్యపుశ్రీవాణిరెడ్డిని మండల అధ్యక్షులు ఉన్నంవాసుదేవనాయుడు, ఎంపిపి ఉన్నం నిర్మల మరియు మండల వైకాపా నాయకులు కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపిటిసి వేమాలయ్య, కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, జయరాంరెడ్డి, వంశీరెడ్డి, భానురెడ్డి, వినాయకరెడ్డి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## పురాతన ఆలయంను నూతన కట్టడానికి అనుమతివ్వండి
.తొట్టంబేడు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త



మండలంలోని కాసరంలో పురాతన ఆలయంగా వెలసి ఉన్న చెన్నకేశవస్వామి ఆలయం శిధిలావస్థకు చేరుకోవడంతో ఈస్థానంలో ఆలయాన్ని కూల్చివేసి కొత్తగా నిర్మాణానికి శ్రీకారం చుట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తొట్టంబేడు మండల వైకాపా అధ్యక్షుడు శంకరయ్య, నాయకులు రాఘవులు, గురుమూర్తి, ప్రసాద్, రఘునాథరెడ్డి, చంద్రయ్య నాయుడులు శుక్రవారం స్థానిక తహశీల్దార్ శివరామసుబ్బయ్యకు వినతిపత్రం అందించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేయాలని చూసినా కుదరలేదు. అయితే ప్రస్తుతం ఆల యాన్ని పునఃనిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. అయితే ఆలయంలో విగ్రహాలను తొలగించేందుకు అనుమతి ఇవ్వాలంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు సమక్షంలో పంచనామా చేసి విగ్రహాలను తొలగించాల్సిన అవసరం ఉంది. అనుమతి ఇవ్వాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.



## పోలింగ్ బూత్‌ల విస్తృత పరిశీలన
తొట్టంబేడు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తహశీల్దార్ ఎ.శివరామసుబ్బయ్య మండలంలోని పోలింగ్ కేంద్రాలను విస్తృతంగా తనిఖీచేస్తున్నారు. శుక్రవారం మండలంలోని 292,293 బూత్‌లు బోనుపల్లి, 285 బూత్ శివనాధపాళెం, 291 కంచనపల్లి గ్రామాల్లో ఉన్న పోలింగ్‌స్టేషన్లును పరిశీలించారు. ఆయనతో పాటుసీనియర్‌అసిస్టెంట్‌మురళీ,విఆర్‌ఓ గోపిరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో బిజెపిని గెలిపించండి
శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త

స్థానిక భాస్కరపేట 3వ వార్డులో బిజెపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోవు ఎన్నికల్లో కేంద్రంలో మరొకసారి రాష్ట్రంలో ఒక సారి బిజెపికి పార్టీకి కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడుగరికపాటిరమేష్‌బాబు,బిజెపిమాజీరాష్ట్రకార్యవర్గ సభ్యులు జివి.అమర్ నాథ్,పట్టణ ప్రధానకార్యదర్శి వాసుయాదవ్, సుబ్రమణ్యం, బిసి నాయకులు రమణయ్య పాల్గొన్నా రు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈఓ ఆకస్మిక తనిఖీలు
శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయఈఓగానూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌వి.నాగేశ్వ రరావు ఆలయంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన తొలుత దేవస్థానం అతిధిగృహాలైన కైలాససదన్, గంగాసదన్ మరియు లోబావి, గోశాల, నక్షత్ర వనం మరియు వర్మీకంపోస్టుతో పాటు ఆలయంలోని రాహుకేతు పూజలకు వినియోగించే వెండి నాగపడగలు తయారు చేసే మింట్‌ను పరిశీలించి ఇక్కడ ఉన్న సిబ్బంది పలుసూచనలు అందించారు. అతిధిగృహాలు శుభ్రంగా ఉండాలని వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని వారితో పనిచేసే సిబ్బంది మర్యాదగా ఉండాలని ఆదేశించారు.

## హరహరతీర్థంలో స్వామిఅమ్మవార్ల పునఃనిర్మాణ పనులు ప్రారంభం
.శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా కైలాసగిరుల్లో వెలసిన హరహర తీర్థంలో స్వామి అమ్మవార్ల పుణ్య నిర్మాణ పనులు మరియు నూతనంగా నిర్మించినఅమ్మవారిదేవాల యానికిశుక్ర వారం ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి, మరియు ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు దేవస్థానం ఈవో ఎవి.నాగేశ్వరరావులుప్రారంభించారు. ఈసం దర్భంగాఅంజూరు తారకశ్రీనివాసులు మాట్లాడుతూ పనసకోనలో వెలసిన హరహర తీర్థంలో శివాలయం శిధిలావస్థకు చేరుకుంటే ఎంఎల్‌ఏ చొరవతో శివాలయాన్ని పూర్తిగా తొలగించి పునఃనిర్మాణ పనులను చేపట్టామన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా కుంభా భిషేకం నిర్వహించాలని అధి కారులకు తెలిపారు. అదేవిధంగా ఆలయంలోకి కావాల్సిన నూతన శివలింగం, నందీశ్వరుడు విగ్రహాలను వెంటనే తెప్పించి జలాధివాసంలోపెట్టాలన్నారు.కార్యక్రమంలోపాలకమండలిసభ్యులు, ఆలయాధి కారులు ఈఈ నూకరత్నం, డిఈ శ్రీనివాసులు, ఎఈ వేణుగోపాల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ మరియు పట్టణ ప్రముఖులు నంద తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలి

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** స్వర్ణముఖి నదిపరివాహక ప్రాంతాలలో ఇసుక మాఫియ విజృంభించి, స్వర్ణముఖి గర్భాన్ని చీల్చి, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఇసుకాసూరులపై జిల్లా ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపాలని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేసారు. తిరుపతి, తిరుపతి పరిసర ప్రాంతాలలో ఇసుక అక్రమ రవాణా యదేచ్ఛగా జరుగుతున్న విజిలెన్స్, పోలీసు, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రాజకీయ నాయకులు పదవుల కోసం ప్రాకుటాడగా, ఉద్యోగులు ధనదాహానికి పోయి ఇసుక అక్రమ రవాణాను ప్రోత్స హిస్తున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నదీ పరివాహక, చెరువులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.తిరుపతిరూరల్‌మండలపరిసర ప్రాంతాలైన చిగురు వాడ, దుర్గసముద్రం, అడపారెడ్డిపల్లి,తనపల్లి,తిరుచానూరు, పైడిపల్లి, తండ్లం, గాజుల మండ్యం తదితర ప్రాంతాలలో దాదాపు 30అడుగుల లోతుగా ఇసుక తవ్వి విక్రయిస్తు న్నారని తెలిపారు. కలెక్టర్, ఎస్పీలు సంయుక్తంగా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, స్వర్ణముఖిలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేసారు.

## గ్రామీణ భారత్ బంద్ విజయవంతం
వరదయ్యపాలెం, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త

రైతులకు నష్టం కలిగే చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కమ్యూనిస్టు నాయకులు డిమాండ్ చేశారు. గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా వరదయ్య పాలెంబస్టాండ్‌నుండి ప్రదర్శన నిరసన కార్యక్రమంనిర్వహించారు. సిపిఐ మంచి చిన్నిరాజ్ సిద్ధలయ్య,తరుణ్ కుమార్, ఏఐటి యుసి నాయకులుచంద్రమురళి,బాల గురునాధం, సిఐటియు నాయకులు శాంతి, ధనుంజయులు పాల్గొన్నా రు.

## వైభవంగా భద్రావతి సమేత భావనారుషిస్వామి ఊరేగింపు
నారాయణవనం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :

నారాయణవనం మేజర్ పంచాయితీ ఎగువపద్మాశాలీవీధిలో వెలసిన భద్రావతి సమేత భావనారుషీస్వామివారి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం స్వామి వారు మోహినీ అవతారంలోను,మధ్యాహ్నం 12గంటలకు కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఉపాధ్యక్షులు కంచి మునస్వామి, బొజ్జా మునిరాఘవులు, అర్చకులు వాసుదేవనవీన్‌కుమార్‌శర్మ,ఉమ్మడిశెట్టిబొజ్జాసుబ్రమణ్యం, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పుత్తూరులో రాస్తారోకో
పుత్తూరురూరల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:

మోదీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త నిరసనలో భాగంగా పుత్తూరులోకమ్యూనిస్టులు భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూ జిల్లా నాయకులు వెంకటేష్, మహేష్, ఏఐటీయూనాయకులు గోపి, కృష్ణారెడ్డి, రమేష్,హరి,భాస్కర్,సీఐటీయూనాయకులువిజయ్, పురుషోత్తం, రమేష్, శివ, వెంకటేష్ పాల్గొన్నారు.

## పుత్తూరులో ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** రథసప్తమి సందర్భంగా పుత్తూరు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌భవనంలో శుక్రవారం రథసప్తమి రోజు సీతా రాములకల్యాణోత్సవం జరిగింది. అయోధ్యలో శ్రీరామజన్మభూమి మందిరంప్రారంభం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగులసంక్షేమ సంఘం ఘనంగా నిర్వహించారు. రాజేష్ కుమార్ సంస్కార్ ఫౌండేషన్ తిరుపతి సౌజన్యంతో పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యకర్తల సహాయ, సహకారంతోసీతారాముల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. హోమం పూజలో స్థానిక ఆడిటర్ రామకృష్ణ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రాజు, గౌరవాధ్యక్షులుగుణశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుప్పయ్య, రాష్ట్ర కార్యదర్శికృపావరమ్మ,జిల్లా ఉపాధ్యక్షులు యుగంధర్‌రాజు, రవిశంకర్, పుత్తూరు శాఖసహాధ్యక్షులుఅరుణాచలరెడ్డి,కోశాధికారిరామలింగం,వెంకటకృష్ణమనాయుడు, రామమూరి రాజు, మేకల సుబ్రహ్మణ్యం, మురళి, వెంకటకృష్ణ, చిరంజీవి,సంఘం తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీయూ కార్యవర్గంలో పుత్తూరుకు ప్రాధాన్యత
పుత్తూరురూరల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:

తిరుపతిలో జరిగిన ఎస్టీయూ 77వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో పుత్తూరుకు సముచితస్థానం కల్పించినట్లుమండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.ముని రాములు, అక్కల వెంకటేశులు తెలిపారు. జిల్లా కార్యవర్గంలో ఆర్థిక కార్యదర్శిగా ఉన్నత పాఠశాల గేట్ పుత్తూరు తెలుగు ఉపాధ్యాయులు కఠారి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్‌గా తొరూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.రమేష్ ఎన్నికైనట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా బొజ్జనెత్తం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడుఆకులకేశవులు, ఉన్నత పాఠశాల గొల్లపల్లి గణిత ఉపాధ్యాయుడు ఇ.వాసు,కార్యదర్శులుగా ఉన్నత పాఠశాల బాలికలు ఉపాధ్యాయుని శోభనాదేవి, తిరుమలకుప్పం, ఉపాధ్యాయుడు కె.గోవర్ధనుడు, వీరప్పరెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.శ్రీనివాసరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అమరం కండ్రిగ ఉపాధ్యాయుడు ఎన్.చంద్రయ్య, ఉన్నత పాఠశాల పరమేశ్వర మంగళం, ఆంగ్ల ఉపాధ్యాయుడు వి.ఎం.రవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వివరించారు. వీరి ఎంపిక పట్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.మునిరాములు, అక్కల వెంకటేశులు, మండల ఆర్థిక కార్యదర్శి ఎన్.యుగంధర్‌లు హర్షం వ్యకతం చేశారు.

## ఇంద్ర వాహనంపై శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి
పుత్తూరురూరల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:

స్థానిక శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవ సందర్భంగా స్వామివారు, అమ్మవారు ఇంద్ర వాహనంపై ఊరేగుతు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలోఉభయదాతగా బీన కొసరాజు, డైరెక్టర్ ఇన్‌చార్జి ఎం.ఎస్.పయనీర్ స్పిన్నింగ్ అండ్ లివింగ్ మిల్స్ లిమిటెడ్ పుత్తూరుఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వంశపారం పర్య ధర్మకర్త ఎం సుందరం దేవస్థానం అర్చకులు ఎస్.రవిచంద్ర గురుకుల్, ఆర్.శరవణ తదితరులు పాల్గొన్నారు.

## సత్యవేడుకు చేరిన వలంటీర్ల సేవా పురస్కారాల సామగ్రి
సత్యవేడు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:

గ్రామ వలంటీర్లకు త్వరలో జరగనున్న పురస్కారాల ప్రధానం నేపథ్యంలో ఇందుకు సంబంధించిన మెడల్స్, బ్యాడ్జీలు, ప్రశంసా పత్రాలు, శాలువ తదితర సామగ్రి జిల్లా నుంచి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుంది. సేవా పురస్కారాల్లో భాగంగా మండలంలో ఐదుగురికి సేవా రత్న, మిగిలిన 271 మంది గ్రామ వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలను ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా త్వరలో అందించనున్నారు. ఫిబ్రవరి 20వ తేదీ గ్రామ వలంటీర్ల సేవా పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహిస్తారని సమాచారం.

## సిద్ధం భారీ బహిరంగసభను జయప్రదం చేయండి
సత్యవేడు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:

ఈనెల 18న అనంతపురం జిల్లా రాప్తాడు వేదికగా జరగనున్న సిద్ధం భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సత్యవేడు వైకాపా సమన్వయకర్త నూకతోటి రాజేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రువారం ఆయన స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. కార్యకర్తలు, ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మెన్ నిరంజన్‌రెడ్డి, గురుప్రసాద్, పగడాల రమేష్,చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం
సత్యవేడు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:

రైతుసమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ అన్నారు. శుక్రవారం జరిగిన గ్రామీణ భారత్ బంద్ లో భాగంగా సత్యవేడు గడియారం స్థంభం వద్ధసిఐటియుఆధ్వర్యంలోనిరసనవ్యక్తం చేశారు.సిఐటియుఅంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేవీబీ పురంలో సీఐటీయూ బంద్
కెవీబీ పురం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:




స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామీణభారత్ బంద్‌లో భాగంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్ మాట్లా డుతూ రైతుల పంటకు మద్దతు ధర కోసం పార్లమెం ట్‌లో చట్టం చేయాలనిడిమాండ్‌చేశారు.కార్యక్రమంలోసీఐటీయూ మండలకార్యదర్శి నాగలా పురం నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు గంగయ్య, జానపద కళాకారుల సంఘం మండల అధ్యక్షులు వెంకటేశులు, గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వేశ్వర యోగ రీసెర్చి సెంటర్‌లో రథసప్తమి



తిరుపతి,ఫిబ్రవరి 16ప్రభాతవార్త:

రథసప్తమి వేడుకలను శుక్రవారం విశ్వేశ్వర యోగ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో ఘనంగాజరుపుకున్నారు. ఉద యం బోధన,బోధనేత సిబ్బంది ,బిఎస్సీ యోగా విద్యార్థులు సూర్యభగవా నునికి ఆవు పిడకలతో పాయ సం నైవేద్యం సమర్పించారు. ఆదిత్య హృదయం, సూర్యాష్టకం, సూర్యఅష్టోత్తరశత నామావళిభక్తితో ఆలపించారు.

